క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

కడప వైఎస్సార్ సర్కిల్: నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ క్రీడల్లో చక్కటి ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపల్ అమిత్‌సింగ్ తెలిపారు. నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్, కోకో, హ్యాండ్ బాల్, త్రోబాల్, తైక్వాండో, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, హాకీ విభాగాల్లో రజతం, కాంస్య పతకాలు అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసమూర్తి, రహమతుల్లా, తిరుమల శెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలి



మాట్లాడుతున్న వలరాజు

కడప వైఎస్సార్ సర్కిల్: ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు పేర్కొన్నారు. కడప నగరం లోని హోచిమెన్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత పది రోజులుగా తరగతులు బహిష్కరించి చేసి విద్యార్థులు నిరవధిక దీక్ష చేస్తున్నారన్నారు. ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులకు ప్రతి నెలా స్టైఫండ్ 2013 వరకు రూ.5 వేలు ఇచ్చేవారని, అది సరిపోవట్లేదని విద్యార్థులు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఎంబీబీఎస్, ఆయుష్, బీడీఎస్ వారికి మాత్రం రూ.25 వేల స్టైఫండ్ ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో తేజ, చంద్ర, అరుణ్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ పాలనలో భక్తుల ప్రాణాలు పోతున్నాయి

కడప వైఎస్సార్ సర్కిల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిపాలనలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. మహా కుంభమేళాలో పుణ్య స్నానాలు చేసిన భక్తుల సంఖ్యను ప్రకటించిన ప్రభుత్వం, అక్కడి మృతుల సంఖ్యను దాచిపెట్టి శవాలను నిర్మానుష్య ప్రదేశాల్లో పారవేసిందని ఆరోపించారు. సౌకర్యాల కల్పనలో బీజేపీ విఫలమైందన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్: హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయులకు దాతలు ఆదివారం అన్నదానం చేశారు. దివంగత ఆలూరు సుబ్బనరసయ్య, ఆయన సతీమణి కమలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆలూరు ఫణిభూషణ్ శాస్త్రి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ రవి, వెంకటసురేష్‌బాబు, పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, దామోదర్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వసతి గృహాల సందర్శన



చిన్నారులతో డీఎస్పీ రమాకాంత్

కడప కోటిరెడ్డిసర్కిల్: స్థానిక అక్కాయపల్లెలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలికా సదన్, కొండాయపల్లెలోని శిశు గృహాను మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమాకాంత్ సందర్శించారు. బాలికా సదన్‌లో వసతి సౌకర్యాలు, నిద్రించే హాల్, టాయిలెట్లు, వంట గదిని పరిశీలించారు. అలాగే సీసీ కెమెరాలు, రాత్రి వాచ్‌మెన్ గురించి ఆరా తీవారు. శిశుగృహాలో ముగ్గురు అనాథ బాలురున్నట్లు గుర్తించారు. ఆయన ఆయా గృహాల నిర్వాహకులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు.

అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం

కడప వైఎస్సార్ సర్కిల్: న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లో శనివారం జరిగిన తొక్కిసలాటలో 15 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. మృతి చెందిన వారికి ఆమె తన సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ కుంభమేళాకు వచ్చిన భక్తులకు తగిన ఏర్పాట్లు చేయడంలో కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ విఫలమయ్యాయన్నారు. రైల్వే శాఖ రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం సంతోషమేగానీ, కేంద్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల పరిహారం అందించాలన్నారు. బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించిన అధికారులను శిక్షించాలన్నారు.

ప్రదర్శనలు లేక.. కేంద్రం వెలవెల

కడప కల్చరల్: కడప కళాక్షేత్రం వెలవెలబోతోంది. నెలల తరబడి ఎలాంటి ప్రదర్శనలూ లేకపోవడం, అద్దె విపరీతంగా పెంచడంతో సామాన్య కళాకారులు రావడం లేదు. రూ.8 వేల అద్దె చెల్లించలేక బెంబేలెత్తుతున్నారు. కళా క్షేత్రం ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉంది. ఆడిటోరియం వెనుక చెక్క పనులు చేస్తున్న కార్మికులు కనిపిస్తారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన సామాగ్రి, ఫర్నిచర్‌ను ఇక్కడ తయారు చేయిస్తున్నాను. కళాక్షేత్రంలోని ఓ గదిని ఇక్కడ కార్యాలయంగా వాడుతున్నారు. ప్రక్క గదిలో ఇంటి నిర్మాణానికి వాడే వస్తువులు, రంగులు కనిపిస్తున్నాయి. ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి నిధులతో ఇటీవల దీనికి మరమ్మతులు చేయించారు. అయినా కళాకారుల ఆశయం మాత్ర నెరవేరడం లేదు. కళాక్షేత్రం ఉత్తరం భాగంలో చెత్త ఎండిపోయి గోడ ఎత్తుకు చేరింది. చిన్నపాటి అగ్గిరవ్వ అంటుకున్నా సమీపంలో ఉన్న విద్యుత్తు స్విచ్ బోర్డుకు తగిలి సామాగ్రి కాలిపోయే ప్రమాదం ఉంది. అప్పుడప్పుడూ ఆటోలు అనధికారికంగా పార్కింగ్ చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పగలంతా బయట పెట్టుకుంటున్న తోపుడు బండ్లు రాత్రి కళాక్షేత్రానికి చేరుతున్నాయి. కళా ప్రదర్శనలు నిర్వహించాల్సిన ప్రాంతంలో ఇవన్నీ జరుగుతున్నా ఏ అధికారి పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అధికారులు పరిస్థితులను చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.



కడప కళాక్షేత్రంలోని ప్రధాన వేదిక



కార్పెంటర్ దుకాణం కాదు..కళాక్షేత్రమే

శివాజీ స్ఫూర్తితో దేశ రక్షణకై పోరాడతాం

కడప కల్చరల్: భారత దేశం సమగ్రతకు తన ప్రాణాలు త్యాగం చేసిన మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో దేశ రక్షణ, అఖండత కోసం కృషి చేస్తామని ఛత్రపతి శివాజీ మరాఠా సేవా సంఘ్, ఛత్రపతి శివాజీ ఐక్య వేదిక నాయకులు తెలిపారు. ఈ నెల 19న ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం కడప నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి శివాజీ విగ్రహానికి పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. నగరంలోని శ్రీ/మాతా అంబా భవాని దేవస్థానం నుంచి పెద్ద ఎత్తున మరాఠా కుటుంబీకులు ఈ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం రెండవ గాంధీబొమ్మ, గోకుల్ సర్కిల్, ఏడురోడ్లు, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, కాగితాలపెంట, నబీకోట, మరాఠీవీధి మీదుగా తిరిగి శ్రీమాతా అంబా భవాని దేవస్థానానికి యాత్ర చేరుకుంది. ప్రత్యేకంగా శిక్షణ పొందిన డ్రమ్స్, మహిళల కోలాటం బృందాలు సందడి చేశాయి. అందరూ కాషాయటోపీలు, కండువాలు, దుస్తులు ధరించి పతాకాలతో ముందుకు సాగారు. పలువురు బాలలు శివాజీ వేష ధారణలో ఆకట్టుకున్నారు. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వేదికపై శివాజీ విగ్రహం



నగరంలో శోభాయాత్ర

ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్ తెలిపారు స్థానిక రామకృష్ణ నగర్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకోసం రానున్న రోజుల్లో పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామని విభజన హామీలో పేర్కొని ఇప్పుడు విస్మరించడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు కోసం ఉద్యమ బాట పడతామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, రామ్మోహన్, మనోహర్, శివకుమార్, అన్వేష్, సత్యనారాయణ, చారిదస్తగిరి, చాంద్‌బాషా, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏ.గఫూర్

దళిత భూ పోరాట సమితి కార్యవర్గం

కడప సెవెన్‌రోడ్స్: దళిత భూ సాధన పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కడప నగరంలోని బసవతారకం లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సమితి నూతన అధ్యక్షుడిగా పెద్దులపల్లె ఓబులపతిని ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధిగా ఎదురూరు బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శిగా కొట్టం సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా మల్లు నాగేంద్ర, సమాచార హక్కు చట్టం ప్రచార కార్యదర్శిగా పచ్చారం బాలు, గౌరవ అధ్యక్షుడిగా కుమార్, కార్యదర్శిగా చింతలకాయల మోహన్, న్యాయ సలహా కార్యదర్శిగా బాలసుబ్బయ్య, కార్యవర్గ సభ్యుల్లో పి.రెడ్డెయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, మాతంగి సుబ్బు, సుబ్బరాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఎన్నికైన సభ్యులతో నాయకులు

నాన్ టీచింగ్ సంఘం ఎన్నిక ప్రశాంతం

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడప జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్(డీఈఓ ఆఫీస్) నాన్ టీచింగ్ జిల్లా సంఘం ఎన్నిక ఆదివారం జరిగింది. కడప డీఈఓ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో నాన్ టీచింగ్ స్టాఫ్ జిల్లా సంఘం ప్రెసిడెంట్‌గా మునెల్లి రమేష్, ప్రధాన కార్యదర్శిగా సాయి ఫణీంద్ర, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు, ట్రెజరర్‌గా ఎన్‌వి.భాను ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎంవీ.క్రిష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్, సరస్వతి, సంధ్యారాణి, ఖలీద్, వెంకటహరి, సెక్రటరీలుగా మల్లికార్జునరెడ్డి, అనంద్ కుమార్, పీవీ.ప్రసాద్, జయసూర్య, శివ ప్రసాద్, సాయిచరణ్, ఉమెన్ సెక్రటరీగా మానస, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా శ్యామ్, బలరాం, లోకేశ్వరరెడ్డి వ్యవహరించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘం సభ్యులు వీరే..

మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఆర్పీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన మెప్మా ఆర్పీల సమావేశంలో వారు మాట్లాడుతూ 2019లో ప్రభుత్వం తీసుకువచ్చిన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని, ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల ఒత్తిళ్లు, బెదిరింపులను ఆపాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, వేతనాలు ఆర్పీల ఖాతాలో జమ చేయాలన్నారు. హామీలు నెరవేర్చకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో విజయలక్ష్మీ, సుజాత, పిచ్చినేని సుబ్బరాయుడు, చంద్రకళ, క్రాంతి, కళావతి, వెంకటసుబ్బమ్మ, విజయలక్ష్మి, డి.చంద్రకళ, ఎం.పద్మావతి, విజయ్‌కుమారి, అరుణ, రమాదేవి, రెడ్డమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మీ

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: ఏక పక్ష వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా పేర్కొన్నారు. నగరంలోని ఆవాజ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రతి పక్ష పార్టీల అభిప్రాయాలను పక్కనపెట్టి, మూడు రోజుల కిందట స్పీకర్ మూజువాణితో బిల్లు ఆమోదించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రతి పక్ష సభ్యుల అభిప్రాయాలనుపట్టించుకోకుండా ఏకపక్ష విధానాలతో వక్ఫ్ బిల్లు ఆమోదించడం రాజ్యాంగానికి వ్యతిరేకమే అన్నారు. వక్ఫ్ ఆస్తులను సర్వే కమిషన్‌కు బదులుగా, కలెక్టర్‌కు సర్వే చేసేందుకు వీలు కల్పించడం, వక్ఫ్ ట్రిబ్యునల్ నిర్ణయాలను హైకోర్టులో సవాలు చేసేందుకు అనుమతించడం వంటి కీలక మార్పులను బిల్లులో ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలే ఐక్యంగా ఉద్యమించి కాపాడుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.అన్వర్‌బాషా, సహాయ కార్యదర్శి ఎస్.షరీఫ్, మహబూబ్‌బాషా, ఎస్.గఫూర్, ఎస్.జహంగీర్‌బాషా, ఎస్.గౌస్‌బాషా, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా

శ్రీకృష్ణ దేవరాయులుకు ఘన నివాళి

కడప కల్చరల్: స్థానిక బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయల జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. కృష్ణా సర్కిల్‌లోని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలతో అలంకరించి కేక్ కట్ చేశారు. అనంతరం అల్పాహార విందు ఏర్పాటు చేశారు.నాయకులు అమరప్ప, హరిప్రసాద్, నారాయణస్వామి రాయల్, సగినాల శ్రీనివాసులు, దుర్గాప్రసాద్/, టింబర్ డిపో శ్రీనివాసులు, మారదాసు రెడ్డెయ్య పాల్గొన్నారు.

ఇంద్రజాలమంటే సైన్స్ మాత్రమే

కడప కల్చరల్: ఇంద్రజాలమంటే సైన్స్ మాత్రమేనని, మాయ మంత్రాలేవీ కావని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సమీర్ బాషా, బాలబయన్న అన్నారు. జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ప్రముఖ మెజీషియన్లు ఆదివారం మేజిక్ షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ మ్యాజిక్ అంటే సైన్సు సూత్రాలతో చేసే మాయ అని, జనాలను సమ్మోహితులను చేయడమేనని అన్నారు. లేనివి ఉన్నట్లుగా చూపుతూ భ్రమలో పడవేయడమేనని, మహిమలు, మంత్రాలేమీ లేవన్నారు. అనంతరం విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంచడానికి ఉపయోగపడే మ్యాజిక్ అంశాలను ఒక్కొక్కటి చూపుతూ దాని వెనుక సైన్స్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో శివరాం,సునీత, అరుణ వెంకటేశ్వర్లు, కుమారస్వామిరెడ్డి, మోహన్, రఘునాథ్, మల్లెల భాస్కర్, తదితరులు హాజరయ్యారు.



మ్యాజిక్ అంశాలను తెలుపుతున్న సమీర్

ఆరోగ్యమే జిల్లాకు మహాభాగ్యం



నగరంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, ప్రజలు

కడప కల్చరల్: ప్రజల ఆరోగ్యమే జిల్లాకు మహాభాగ్యమని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి అన్నారు. కడప నగరంలో రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహావీర్ సర్కిల్ నుంచి ఆదివారం 10కే మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై నగర వాసులను అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మురళీరెడ్డి, సభ్యులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆట-పాట

కడప కల్చరల్: ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలో స్థానిక కిశోర్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు తమ ఆట పాటలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు ప్రాచుర్యం పొందిన సినీ గీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. ఏఓ శివప్రసాద్‌రెడ్డి, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: భారత వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ సంస్థ సంయుక్తంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సందీప్‌కుమార్ తెలిపారు. స్థానిక నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో ఆదివారం శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 22 రోజులపాటు జరిగే శిక్షణలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్ వ్యూహాలు, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు రూ.7 వేల స్టైఫండ్‌తో క్షేత్ర స్థాయి శిక్షణ ఇస్తారన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న సందీప్‌కుమార్

డాక్టరేట్ ప్రదానం

కడప ఎడ్యుకేషన్: అప్లైడ్ మేథమెటిక్స్ స్కాలర్ రాజవత్ నారాయణనాయక్‌కు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య ఎస్.సునీత పర్యవేక్షణలో ×సిగ్నిఫికెన్స్ ఆఫ్ థర్మల్ రేడియేషన్ ఆన్ డిఫరెంట్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ ఫ్లోస్ ఓవర్ ఏ స్ట్రెచింగ్ సీట్ అండర్ వేరియస్ బౌండరీ కండిషన్స్‌లో×పై ఆయన చేసిన పరిశోధనలను గుర్తించి నిపుణుల బృందం డాక్టరేట్ అందించింది. జాతీయ జర్నల్స్‌లోనూ నారాయణ నాయక్ జర్నల్స్ ప్రచురితమయ్యాయి. వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఎస్ రఘునాథరెడ్డి, ఆచార్య పుత్తా పద్మ ఆయనను అభినందించారు.



నారాయణ నాయక్

కాంప్లెక్స్ సమావేశాల సమయం మార్చాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు నిర్వహించే క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నాలుగు గంటలకు ముగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. కడప జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మధ్యాహ్నం వరకు పాఠశాలలలో ఉండి క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు ఒంటి గంటకు చేరుకోవాలని చెప్పడం ఇబ్బందిగా ఉందన్నారు. పాఠశాల సమయం నాలుగు గంటలకే ముగించాల్సి ఉండగా.. కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో ఐదు గంటల వరకు పెంచడమేగాక అటెండెన్స్ పడకుండా చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పూరి నాగరాజు, ఆవుల శ్రీనివాసులు, బి చంద్రశేఖర్, ఎల్వీ.రవిశంకర్, అబ్దుల్‌సలాం, శ్రీరామ్, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

నాలుగు గంటలకే ముగించాలి

రోజూ సాయంత్రం ఐదు గంటలకే క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల సమయం ముగిసినప్పటికీ 5.30 గంటల వరకు అటెండెన్స్ పడకపోవడం, ఆరు గంటల వరకు యాప్ పనిచేయడం ఆందోళన కలిగిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, అధ్యక్షుడు మాదన విజయకుమార్, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. విలేకరులతో వారు మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేని ప్రాంతాల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళా ఉపాధ్యాయినులకు ఇబ్బంది కలిగే ప్రమాదం ఉందన్నారు. ఉదయం ఫోన్ ఛార్జ్ చేయడంతో .. సాయంత్రం వరకు ఉండే అవకాశం లేదన్నారు. అలాంటప్పుడు ఎలా అటెండెన్స్ వేయడానికి వీలవుతుందని ప్రశ్నించారు. సమావేశాల సమయాన్ని మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

టీచర్ల ఓపికను పరీక్షించవద్దు

ఉపాధ్యాయులకు క్లస్టర్ ట్రైనింగ్ పేరుతో ఫేషియల్ యాప్‌లో సాయంత్రం 5:30 హాజరు వేయడానికి అవకాశం లేకుండా చేయడం తగదని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు బత్తల వెంకట ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయినులు అటెండెన్స్ కోసం వేచి చూసి ఆలస్యమవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. కాంప్లెక్స్ సమావేశాలు అనవసరమని, ఏడాది పది రోజులు విద్యార్థులు చదువు కోల్పోతున్నారన్నారు. సమావేశాలు రద్దు చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో గోపి, బాలసుందరం, ఖాదర్‌బాషా, జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.